అన్నదాతకు వెన్నుపోటు



అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేశామని కూటమి ప్రభుత్వం డప్పు కొడుతుండగా.. మరో వైపు రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. అన్ని అర్హతలుండి కొందరికి అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదు. మరికొందరికి రూ.5 వేలు, రూ.2 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. దీంతో రైతులు తీవ్ర అయోమయంలో ఉన్నారు. అన్నదాత సుఖీభవ నిధులు ఎందుకు పడలేదో చెప్పేవారు లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

–కార్వేటినగరం

- కొందరికి రూ.2 వేలు.. ఇంకొందరికి రూ.5 వేలు
- అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ నిధులు జమలో గందరగోళం
- అరకొర విదిలింపులు
- అయోమయంలో రైతాంగం

గత ప్రభుత్వంలో రైతు భరోసా వివరాలు		
సంవత్సరం	రైతుల సంఖ్య	రూ.కోట్లల్లో
2019-20	220256	165.19
2020-21	231038	173.52
2021-22	216594	162.45
2022-23	223165	211.12
2023-24	231144	174.03

జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతుభరోసా కింద 231.144 మందికి పెట్టుబడి సహాయం అందించారు. అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు తొలి ఏడాది ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రెండో ఏడాది అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలను రాష్ట్ర ప్రభుత్వం, పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేలను ఖాతాలలో జమ చేశామని, ఈ నెల 2వ తేదీ ప్రకటించారు. ఇందులో అన్నదాత సుఖీభవ పథకానికి 2,05,753 మంది అర్హులని, అధికారులు ప్రకటించారు. గత ప్రభుత్వం ఇచ్చిన దానికన్నా 25.391 మందిని అనర్హులుగా ప్రకటించారు.

పీఎం కిసాన్ మాత్రమే..

ఈకేవైసీ 1బీ మ్యూటేషన్ కాలేదని, ఫ్యామిలీ మ్యాపింగ్ అంటూ వివిధ రకాలతో గత ప్రభుత్వంతో పోలిస్తే లబ్ధిదారుల సంఖ్యను తగ్గించారు. వీరికైనా రూ.7 వేలు జమ అయ్యాయంటే అదీ లేదు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా జిల్లాలో కేవలం కొంత మందే అర్హత సాధించారు. వీరికే కేంద్రం ఇస్తున్న రూ.2 వేలు జమ అయ్యాయి. అదేవిధంగా అధికారులు ప్రకటించిన జాబితాలో సగం మంది రైతులు అన్నదాత సుఖీభవ పొంది, పీఎం కిసాన్‌కు దూరమయ్యారు.

సుఖీభవకు మంగళం

ఇదిలా ఉండగా పీఎం కిసాన్ నగదు పొంది, అన్నదాత సుఖీభవకు చాలా మంది దూరమయ్యారు. పీఎం కిసాన్‌లో రూ.2 వేలు జమకాగా అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.5 వేలు వీరికి జమ కాలేదు. దీంతో రైతుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. పీఎం కిసాన్‌కు అర్హత సాధించిన రైతు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవకు ఎలా అనర్హుడవుతాడని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కూటమి నేతలు అధికారంలోకి రాగానే రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పారని, ఆ మాటకు కట్టుబడి వివిధ జాబితాలు, ఈ–కేవైసీలు, ఆధార్, బ్యాంకు అకౌంట్ లింకు తదితర సాకులు చెప్పకుండా అర్హులైన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆంక్షలు లేకుండా అందించారు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి ఏడాది క్యాలెండర్ ప్రకారం రైతుభరోసా నిధులను అందించింది.

రూ.2 వేలు మాత్రమే వచ్చాయి



పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.2 వేలు మాత్రమే నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అందజేయాల్సిన రూ.5 వేలు అన్నదాత సుఖీభవ నిధులు జమ కాలేదు. పీఎం కిసాన్‌కు అర్హుడైన నేను అన్నదాత సుఖీభవకు ఎందుకు అర్హత సాధించలేదో అర్థం కావడంలేదు. కారణం ఏమిటో చెప్పేవారు లేరు.

–ప్రకాష్, రైతు, పాలసముద్రం మండలం

పీఎం కిసాన్ జమకాలేదు



అన్నదాత సుఖీభవ మాత్రమే నా ఖాతాలో జమ అయ్యింది. పీఎం కిసాన్ నిధులు జమ కాలేదు. ఒక పథకానికి అర్హులైనప్పుడు, మరో పథకానికి అర్హత కాలేక పోవడంపై అనుమానం ఉంది. పరిష్కారం అడిగినా ఎవరూ చెప్పేవారు లేరు.

–ఆనంద్, రైతు, పాలసముద్రం మండలం

రైతులను ప్రభుత్వం మోసం చేస్తోంది.



ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వివిధ కారణాలతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించింది. ఇప్పుడేమో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ అంటూ రెండు జాబితాలు తయారు చేసి అనర్హులను చేస్తోంది. ఒక పథకానికి అర్హత సాధించిన రైతు మరో పథకానికి అనర్హుడు ఎలా అవుతాడో ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

–చందురాజు, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి, కార్వేటినగరం

రూ.20 వేలు ఇవ్వాలి



టీడీపీ నేతలు ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు కేంద్రంతో సంబంధం లేకుండా ఇస్తామని ఊదరగొట్టారు. తీరా గెలిచాక పీఎం కిసాన్‌తో కలిపి అంటున్నారు. ఇప్పుడేమో ఈ–కేవైసీ తదితర కుంటి సాకులతో కొందరికి రూ.5 వేలు, మరికొందరికి రూ.2 వేలు జమ చేసి రైతులను మభ్యపెడుతున్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేంద్రంతో సంబంధం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమ చేయాలి.

–కేఆర్ వెంకటరెడ్డి, రైతు నాయకుడు, గంగాధరనెల్లూరు

క్లుప్తంగా

వైభవంగా యజ్ఞోపవీతధారణ



యజ్ఞోపవీతధారణ చేసుకున్న బ్రాహ్మణ సంఘ సభ్యులు

నగరి: శ్రీవాణి గాయత్రి బ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీకామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలో శనివారం యజ్ఞోపవీత ధారణ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రుగ్వేద పండితులు తులామార్గ బంధు శర్మ ఆధ్వర్యంలో ఉపకర్మ నిర్వహించారు. వచ్చిన బ్రాహ్మణులందరికీ వందవాసి శివకుమార్ శర్మ యజ్ఞోపవీతాలు అందించారు. అందరూ వేదమంత్రోచ్ఛారణ చేసి యజ్ఞోపవీతాలను ధరించారు. ఈ కార్యక్రమంలో పురాణం ప్రవీణ్ కుమార్, దేవులపల్లి సురేష్, అరిపిరాల శ్రీనివాసులుశర్మ, తులాముని రత్నంశర్మ, జనార్దన్, ధర్మగాడి గురునాథన్, గురు రామచంద్రన్, భాకరాపేట శివప్రసాద్, ఓరుగంటి సుందరం తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో భారీ వర్షం

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుండి దాదాపు రెండు గంటలపాటు భారీ వర్షం పడింది. రానున్న వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలు అమ్మకందారులకు భారీ వర్షం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ సైతం దెబ్బతినే విధంగా ఉందని రైతులు వాపోతున్నారు. గురువారం రాత్రి 40.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

మహా కుంభాభిషేకానికి భారీ ఏర్పాట్లు



గరిగలపల్లి శ్రీలక్ష్మీ గణపతి ఆలయం

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని పాత వెంకటాపురం పంచాయతీలోని గరిగలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి, దక్షిణామూర్తి, మహాలక్ష్మీ విద్యా సరస్వతి ఆలయ విగ్రహ విస్మరణ కార్యక్రమం, మహా కుంభాభిషేక కార్యక్రమానికి గ్రామస్తులు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 11 నుండి 13 వరకు మహా కుంభాభిషేక వేడుకలు నిర్వహించనున్నట్లు, ఆంధ్ర కర్ణాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

నేడు రాజగోపుర నిర్మాణానికి భూమిపూజ



శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయం

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీప్రసన్న వేంకటేశ్వర ఆలయం ముందు రాజగోపురం నిర్మాణానికి భూమి పూజను ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీవారు తెలిపారు. నింద్రలో శ్రీకృష్ణ దేవరాయలు కాలంలో నిర్మించిన శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మించారు. టీటీడీ సహకారంతో రూ.1.70 కోట్లతో ఆలయాన్ని పునరుద్ధరించారు. ప్రస్తుతం రాజగోపురం, ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

నులి పురుగులను నులిమేద్దాం



నులిపురుగుల నివారణపై ర్యాలీ

విజయపురం: పరిశుభ్రతతో నులిపురుగులను నివారించవచ్చునని సీహెచ్ఓ భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని శనివారం పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా కలుషితమైన నీటిని తాగడం ద్వారా నులిపురుగుల బారిన పడడానికి దారి తీస్తుందన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయకూడదన్నారు. ప్రతి ఒక్కరు భోజనానికి ముందు, తరువాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. సురక్షితమైన నీరు తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి క్షేత్రంలో పౌర్ణమి పూజలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో శనివారం శ్రావణ పౌర్ణమి పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కల్యాణ వేదికపై ఉత్సవమూర్తికి విశేష పూజలు జరిపించారు.

మేధావుల విభాగం అధ్యక్షుడిగా దేవరాజులురెడ్డి

శ్రీరంగరాజపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఆ పార్టీ మేధావుల విభాగం మండల అధ్యక్షుడిగా 49 కొత్తపల్లిమిట్టకు చెందిన ఎస్.దేవరాజులురెడ్డి, ఉపాధ్యక్షుడిగా భువనేష్, రఘు, ప్రధాన కార్యదర్శిగా రవిరెడ్డి, శివాజీ, జగదీష్, తేజేష్, కార్యదర్శులుగా శశికుమార్, ప్రకాష్, ముత్యాలు, అమృతరాజ్, సురేష్, కార్యనిర్వహక సభ్యులుగా చిన్ని, సుబ్రమణ్యం, వినోద్, జయరాజ్, గంగయ్య, నాగయ్యను నియమిస్తునట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

వేడుకగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో ప్రత్యేక దీపారాధన

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి పౌర్ణమి సందర్భంగా శనివారం రుద్రాభిషేకం, యాగశాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు యాగశాలకు కావాల్సిన పూజాసామగ్రితో మంగళ వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి స్వామివారికి సమర్పించారు. వేదపండితులు నవగ్రహ హోమం, శాంతి హోమం తదితర యాగశాల పూజలు చేశారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యిలతో అభిషేకించి, సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మండల పరిధిలోని భక్తులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్



కుమారస్వామిరెడ్డికి రాఖీ కడుతున్న మాజీ మంత్రి



రామ్‌ప్రసాద్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆర్‌కే రోజా

నగరి: అనుబంధాలకు ప్రతీకగా నిర్వహించుకునే పండుగ రక్షాబంధన్ అని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం రాఖీ పండుగను పురస్కరించుకొని తిరుపతిలోని తన సోదరుని నివాసంలో ఆమె రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. సోదరుడు కుమారస్వామిరెడ్డికి, నగరి పట్టణంలోని తన నివాసంలో సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డికి రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనంగా ఆత్మీయంగా ఆచరించే శుభపర్వదినమైన రాఖీ పౌర్ణమిని జరుపుకోవడం చాలా ఆనందాన్ని ఇస్తుందన్నారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు తమ మధ్యన ఉండే ప్రేమానురాగాలకు ప్రతీకగా ఈ పండుగను నిర్వహించుకుంటారన్నారు.

రాఖీ.. శ్రీరామరక్ష



చిన్నారిని ఆశీర్వదిస్తున్న సోదరి

కార్వేటినగరం: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన రాఖీ పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్వేటినగరంలో చిన్నారుల రాఖీ సంబరాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవం





విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న నిర్వాహకులు, సాంస్కృతిక కార్యక్రమాలు

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్‌కండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే కుంభాభిషేక మహోత్సవాల్లో మొదటి రోజు శనివారం ఆలయంలో గంగపూజ, మృత్సంగ్రహణ పూజ, గోపూజ, మహా గణపతి పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ప్రాణప్రతిష్ట చేయనున్న నూతన విగ్రహాలను ఊరేగించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై విగ్రహాలను వేంచేపు చేశారు. ఆలయ ధర్మకర్త రామయ్య నివాసం నుంచి విగ్రహాలను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ఉంచారు. మహిళలు మంగళ హారతులు, కర్పూర నీరాజనాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. యువత పెత్త ఎత్తున బాణసంచా కాల్చి సందడి చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు మాజీ ఉప ముఖ్యమంత్రి పర్యటన

మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆదివారం మండలంలో పర్యటిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి తెలిపారు. సీఆర్ కండ్రిగ గ్రామంలో జరుగుతున్న వినాయక స్వామి కుంభాభిషేక మహోత్సవానికి ఆదివారం ఉదయం 10 గంటలకు హాజరవుతారని తెలిపారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అదేవిధంగా అగ్గిచేనుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం

పాలసముద్రం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాలసముద్రం మండలంలో వివిధ విభాగాల్లో కమిటీలను నియమించారు. బీసీ విభాగ కమిటీకి ప్రెసిడెంట్‌గా వెంకటేసు మండడి, వైస్ ప్రెసిడెంట్లుగా మురళి, టి.శేఖర్, జనరల్ సెక్రటరీలుగా సి.రామమూర్తి, రవిరెడ్డి, ఎస్.క్రిష్ణయ్య, పయణి, సెక్రటరీలుగా దేవరాజ్, శేషాద్రి, ఆర్.శ్రీనివాసులు, పి.ప్రసాద్. పి.హేమాద్రి, కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.బాబు, ఎం.దేవి, గోపి, వెంకటేష్, నందగోపాల్, జగన్నాథంలను నియమించారు.

సాంస్కృతిక విభాగం కమిటీ

ప్రెసిడెంట్‌గా వాసురాజు, వైస్ ప్రెసిడెంట్లుగా కె.పయణి, భాస్కర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా మునిరత్నం రాజు, పి.ధనరాజ్, కె.గోవిందస్వామి. పి.సంజీవి, కార్యదర్శులుగా యువరాజ్, రమేష్, సురేంద్రన్, సూర్య, ఎం.మునిక్రిష్ణన్, కార్యనిర్వాహక సభ్యులుగా నీలకంఠన్, బీకే రామస్వామి, ఈకే వెంకటేష్, రాందాస్, వి.విజయ్, కేఎల్ పయణి నియమితులయ్యారు.

మహిళా విభాగం కమిటీ

ప్రెసిడెంట్‌గా రమాదేవి, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం.అనురేఖ, రాణెమ్మ, జనరల్ సెక్రటరీలుగా జీవిత, లిల్లీ, పుష్ప, అంబిక, సెక్రటరీలుగా శుభ, ఆర్.రాధిక, సెల్వి, ఎల్లమ్మ, జి.రాణెమ్మ, కార్యనిర్వాహక సభ్యులుగా సి.అఖిల, జి.ఆండాలు, పి.సుమతి, పి.అనూష. చిత్ర, కల్పన నియమితులయ్యారు.

మైనారిటీ విభాగం కమిటీ

ప్రెసిడెంట్‌గా డి.మధీర్ ఆలీ, వైస్ ప్రెసిడెంట్లుగా కె.అసార్‌బాషా, బాబుతుయాసిన్, జనరల్ సెక్రటరీలుగా జాకీర్ హుసేన్, అజీమ్, నజీంబాషా, షారుక్‌ఖాన్, సెక్రటరీలుగా అమీద్, ఎస్ నజీర్, శబరీష్, జఫీర్అల్లీ, చోటా సాహెబ్, కార్యనిర్వాహక సభ్యులుగా జావీద్, ఆలీ, సయ్యద్ ఆలీ, మౌలన్, ఖాదర్ బాషా, నాగూర్ బాషాలను నియమించారు.

పంచాయతీరాజ్ విభాగ కమిటీ

ప్రెసిడెంట్‌గా ఎ.సురేష్, వైస్ ప్రెసిడెంట్లుగా కె.రంజిత్ కుమార్, కె.గోపాల్, జనరల్ సెక్రటరీలుగా విజయకుమార్, నరసింహరాజు, మధు యాదవ్, శ్రీకాంత్, సెక్రటరీలుగా ఆర్.రవి, సి.బాబు, నందగోపాల్, కె.సురేష్, టి.ప్రభు, కార్యనిర్వాహక సభ్యులు భరత్, టి.పాండియన్. ఆర్.బాలాజీ, ప్రవీణ్, ఎస్.నిర్మల్ కుమార్, సత్యరాజ్ నియమితులయ్యారు.

ప్రచార విభాగం కమిటీ

ప్రెసిడెంట్‌గా సి.వెంకట నరసింహరాజు, వైస్ ప్రెసిడెంట్లుగా ఆర్.అరుల్, ఆనందన్, జనరల్ సెక్రటరీలుగా రాజామణి, లూకాస్, ఎ.క్రిష్ణారెడ్డి, లక్ష్మీపతి, సెక్రటరీలుగా ఎన్‌సీ శేఖర్, ఎల్.నారాయణన్, పి.కుమార్ నాయుడు, శివలింగం, ఇ.కోదండన్, కార్యనిర్వాహక సభ్యులుగా పి.బాలాజీ, కె.ప్రకాష్, పి.జగన్నాథం, పన్నీర్, మురుగేషన్, బీఎస్ దామోదరన్‌లను నియమించారు.

రైతు విభాగం కమిటీ

ప్రెసిడెంట్‌గా షణ్ముగంరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా కేశవరాజు, త్యాగరాజ్, జనరల్ సెక్రటరీలుగా వరదరాజులు, రవిరెడ్డి, మురుగేషన్, నాగేష్ యాదవ్, సెక్రటరీలుగా బాబు బోయడు, గణేష్‌రెడ్డి, కుప్పారెడ్డి, సీమాన్, వడివేలురెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా సి.సుబ్రమణ్యం, ఎ.మునివేలు, మనోహర్ రెడ్డి, కె.గోపాల్ రాజు, సుగందర్‌రాజు, ఢిల్లీబాబు నియమితులయ్యారు.

ఎస్సీ విభాగం కమిటీ

ప్రెసిడెంట్‌గా వి.అయ్యప్పన్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎండీ ప్రేమ్ కుమార్, కుట్టి(అంబేడ్కర్), జనరల్ సెక్రటరీలుగా సి.పయణి, జె.బాబు, సి.సుబ్రమణ్యం, సి.శేఖర్, సెక్రటరీలుగా జె.విజయకుమార్, క్రిష్ణయ్య, టి.బాలా, విజయన్, జె.ఇళయరాజా, కార్యనిర్వాహక సభ్యులుగా ఈరబ్బా, ఎస్.ఆరుముగం, కె.వాసు, టిజకమలేష్, టి.బాలక్రిష్ణన్, ఎస్.కార్తీక్ నియమితులయ్యారు.

సోషల్ మీడియా విభాగం

ప్రెసిడెంట్‌గా ఎల్.గోపి, వైస్ ప్రెసిడెంట్లు రజనీ, నరసింహన్. జనరల్ సెక్రటరీలుగా ఆరుముగం, ఆర్.అయ్యప్పన్, బి.అప్పు, ఎస్.మునస్వామి, సెక్రటరీలుగా టి.సుగంధర్, శివకుమార్, ఎం.ప్రేమ్ కుమార్, శరవణన్, డి.లక్ష్మణన్, కార్యనిర్వాహక సభ్యులుగా పి.నరసింహన్, ఎస్.సుమన్, ఎస్.ఆనందన్, సి.మునస్వామి, ఇ.ప్రకాష్, ఎం.రవిని నియమిస్తున్నట్లు ప్రకటించారు.

విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న మహేష్‌బాబు అభిమానులు

గంగాధరనెల్లూరు: సినీ నటుడు సూపర్‌స్టార్ ఘట్టమనేని మహేష్‌బాబు 50వ జన్మదిన వేడుకలను ఆయన అభిమాన సంఘం జిల్లా నాయకుడు లోకనాథం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు, అనంతరం మండల కేంద్రంలోని స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు రాజేంద్రన్, మోహన్, రాజా, ప్రేమ్, కృష్ణన్, హరికృష్ణ రెడ్డి, నక్షత్రం, హరిబాబు, ఢిల్లీ కుమార్, చిన్న,మోహన్, మదన్, మహేష్, శేఖర్, సురేష్, సుధీర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులు వైద్య పరీక్షలు చేసుకోవాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జయకుమార్

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రతి గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతా శిశు మరణాలు జరగవని వైద్యాధికారి జయకుమార్ తెలిపారు. శనివారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భవతులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ తదితర పరీక్షలు చేశారు. డాక్టర్ వి.వసంతి మాట్లాడుతూ గర్భిణులు మజ్జిగ, పండ్లరసం, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ప్రసవం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోనే చేసుకుంటే మాతా, శిశువులు బాగుంటారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు చేసుకోవా లన్నారు. అనంతరం 43 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుబ్రమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన

నింద్ర: మండలంలోని అగరం గ్రామంలో రైతులకు చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అదే విధంగా సజ్జ పంట సాగుపై తీసుకోవాల్సిన సూచనలిచ్చారు. విత్తన శుద్ధి చేయడంతో రైతులకు మేలు జరిగే అంశాలను వివరించారు. రైతులు సజ్జపంటలో కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలను వివరించారు. అనంతరం రైతులకు విత్తన శుద్ధి మందులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ తులసీరాం, స్థానిక రైతులు పాల్గొన్నారు.

వైభవంగా మహా రథోత్సవం

- గరుడ వాహనంపై శ్రీకృష్ణుడి చిద్విలాసం
- దుర్యోధన వధతో పాండవుల విజయోత్సవం
- ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలతో పులకించిన పుత్తూరు

పుత్తూరు: ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. చివరి అంకంలోని రెండో రోజైన శనివారం విజయోత్సవాన్ని చాటుతూ పాండవులు నిర్వహించిన మహా రథోత్సవం మహాభారతాన్ని కనుల ముందు ఆవిష్కరించింది. గజ, తురగ, పదాతులు వెంట నడువగా, మంగళ వాయిద్యాలు, బాణాసంచా నడుమ, ముందు భాగాన శ్రీకృష్ణ రథం నడువగా వెనక మహా రథోత్సవం అశేష భక్తజనం మధ్యన వైభవంగా సాగింది. 40 అడుగుల మహారథానికి ఇరువైపులా వందలాది మంది భక్తులు గోవింద.. గోవిందా.. అంటూ భక్తిపారవశ్యంతో లాగుతుంటే పట్టణ పుర వీధులు జనసంద్రమయ్యాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పుత్తూరు పట్టణం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలం బాబు, మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. అనంతరం శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజు స్వాములను విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు పల్లిపట్టు ఏలుమలై మొదలియార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గరుడ వాహనంపై శ్రీకృష్ణ భగవానుడు రాయబారం కోసం తరలివెళ్లే ఘట్టం భక్తులను ఆకట్టుకొంది. శ్రీకృష్ణుడికి అడుగడుగునా మంగళ హారతులిచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు మేదర సంఘం ఆధ్వర్యంలో భీముడు దుశ్శాసనుని వధించిన రక్తంతో ద్రౌపదీదేవి కురులను తడిపే ఘట్టం అందరిని అలరించింది. అనంతరం దుర్యోధనుడిని భీముడు సంహరించడం, విజయోత్సవంతో పాండవులు రథాన్ని అధిరోహించే ఘట్టాలు భక్తులను ఉర్రూతలూగించాయి. పుత్తూరు పట్టణ కమ్మ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో మహారథంపై విహరించిన ద్రౌపదీదేవి సమేత పాండవ రాజులకు అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పట్టారు. మహారథం ముందు శ్రీకృష్ణ రథంపై పాండవుల వేషధారణ, విజయోత్సవ విన్యాసాలు అందరినీ అలరించాయి.



భక్తజన సందోహం మధ్య మహా రథోత్సవం

నేడు అగ్నిగుండ ప్రవేశం

ఆదివారం ఉదయం 6 గంటలకు గెరిగ ఊరేగింపు, 9 గంటలకు కల్పవృక్ష వాహనం, 10 గంటలకు ఉత్సవం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి సత్యశీలతకు నిదర్శనంగా అశేష భక్తజన అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నారు.